


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 12 పుష్పం : 31-33 5-3-2003

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

**PAGES : 16**

**VOL : 8 ISSUE : 12**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 26-1-2003, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కోరిక విడిచిపెట్టండి, కోపం విడిచిపెట్టండి, భయం విడిచిపెట్టండి అని భగవంతుడు చెపుతున్నాడు. మనిషికి చాలారోగములు భయంలో నుండి వస్తున్నాయి, అది మీకు తెలియటంలేదు. భయం శరీరానికి ఉండదు, భయం మనస్సులో ఉంటుంది. మనస్సులోఉన్న భయం శరీరంమీద పడి అనేకరోగాలు వస్తున్నాయి. ఆత్మవిశ్వాసం పెంచుకోవటం వలన భయం తగ్గుతుంది. భగవంతుడి మీద నమ్మకం లేనివాడు నాస్తికుడు కాదు, మీ మీద మీకు విశ్వాసం లేకపోతే మీరు నాస్తికులు అని స్వామీజీ చెప్పారు. మీకు బంధువులు బలం ఉన్నా, ఆరోగ్యబలం ఉన్నా, అర్ధబలం ఉన్నా మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే మీరు జీవితంలో ఏదీ సాధించలేరు. డూనాట్ ఫియర్, గాడ్ ఈజ్ నియర్ అన్నారు స్వామీజీ. భగవంతుడు నీ వెంటఉంటే నీకు భయపడవలసిన పని ఏముంది. మంట ఎదురుగా ఉంటే చలి ఎంతఉన్నా భయం ఏమిటి అలాగే భగవంతుడు మీకూడా ఉన్నప్పుడు భయం దేనికి? భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే దేనికి భయపడవలసిన పనిలేదు. ప్రతి చిన్నవిషయానికి కోపం తెచ్చుకొంటూఉంటే జీవితంలో నష్టపోతారు.

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

26-1-03 జిన్నూరు ........ 1
19-2-03 గణపవరం ........ 6
26-2-03 శివదేవునిచిక్కాల ........ 12

Visit us @ www.srinannagaru.com





ఏ కర్రకు నిప్పు ఉంటే ఆ కర్రే కాలుతుంది, అలాగే ఎవడైతే ప్రతి చిన్నవిషయానికి కోపం తెచ్చుకొంటున్నాడో వాడు లోపల కాలిపోతూ ఉంటాడు, వాడికి శాంతి ఉండదు. హృదయం శాంతితో, ఆనందంతో తొణికిసలాడుతున్నప్పుడు అసలు కోరికే ఉదయించదు. నీ హృదయంలో ఉన్న అశాంతే, వెలితే కోరిక క్రింద వస్తుంది. మనలను మనం పరిశీలన చేసుకొంటే, పరిశోధన చేసుకొంటే మన గురించి మనం ఆలోచించుకొంటే అసలు మూలతలంపే లేదన్న సంగతి తెలుస్తుంది. ఉల్లిపాయకు ఉన్న పొరలు అన్నీ తీసివేస్తే ఉల్లిపాయలేదు అలాగే ఒకోతలంపు, ఒకోతలంపు తీసివేస్తే మూలతలంపు లేదు. భగవంతుడు గురించి, జ్ఞానం గురించి చెపుతూ ఉంటే ఎవడికయితే లోపల ఆనందం వస్తోందో వాడు మాత్రమే నిజమైన భక్తుడు. భగవంతుడు గురించి జ్ఞానం గురించి తప్పించి ఎవరైనా లోకవిషయాలు చెపుతూ ఉంటే మీకు సంతోషం వస్తూ ఉంటే మీరు భక్తులు కాదు అని అర్థం. మనకంటే వేరుగా ఏదో ఉంది అనుకొన్నప్పడే మనకు కోరికలు పెరుగుతాయి, మనకు వేరుగా ఏదీలేదు. ఒక మనిషి మంచివాడు అని చెప్పటానికి ఇంకో మనిషి చెడ్డవాడు అని చెప్పవలసిన పనిలేదు. ఈమధ్య మాకు కష్టాలు వస్తున్నాయి అని కొంతమంది అంటున్నారు. కష్టాలు రాకపోతే వీక్‌మైండ్ స్ట్రాంగ్‌మైండ్ అవ్వదు. గాంధీగారు జీవితం పొడుగునా కష్టాలు పడ్డాడు, ఎన్నో అవమానాలు భరించాడు, అందుచేత ఆయన మహాత్ముడు అయ్యాడు. కష్టాలు మీకు పరీక్షలు వంటివి.పరీక్ష పాసైతే కదా మీరు హైయర్ క్లాస్‌కు వెళ్ళేది. మనకు వచ్చే తలంపుల విషయంలో ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం జ్ఞానాన్ని ప్రచారంచేస్తూ ఉంటే మనకు జ్ఞానం కలుగుతుంది. మనం అసూయను ప్రచారం చేస్తున్నాము అనుకోండి, మనం అసూయగ్రస్తులం అయి, మూలంలో కుళ్ళిపోతాము. మనం ఏది ఆలోచిస్తూ ఉంటే అదే అవుతాము. మీరు పనిని విడిచిపెట్టవద్దు. కాని మనకు గౌరవాలమీద ఉన్న ఇష్టం, డబ్బుమీద ఉన్న ఇష్టం, గోడలమీద పేర్లు వ్రాయించుకోవటం మీద ఉన్న ఇష్టం పనిమీద లేదు. పనిమీద మనకు గౌరవం లేదు. పనిచేయకుండా సంపాదన రావాలి, గౌరవం రావాలి అనుకోవటం మంచిది కాదు. పనిని ప్రేమించాలి. చేసేపని ఇష్టంగా, ప్రేమగా నిష్కామంగా చేయాలి. దేహప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు మనకు ధనంఇస్తే అంతా మనమే తినేయకూడదు, కొంతభాగం ప్రజలకు ఖర్చుపెట్టాలి. మొత్తండబ్బు అంతామనమే ఖర్చుపెట్టుకొంటే మనలో భోగప్రవృత్తి పెరిగిపోతుంది. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా రెండూ కూడా స్వప్నంతో సమానము. అందుచేత ఎటువంటి పరిస్థితులలోను మీరు శాంతిని పోగొట్టుకోవద్దు. శాంతిలేనివాడికి సుఖంలేదు. అందుచేత అన్ని విధములుగా ప్రయత్నంచేసి మనం శాంతిని కాపాడుకోవాలి.

నా గురువు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది అని అడిగితే ధ్యానంవలన తెలుస్తుంది అని చెప్పారు. ఎవరిని స్మరించుకోవటం వలన నీ మనస్సుకు చల్లదనం కలుగుతుందో, ఎవరి సమక్షంలో నీకు వివేకం కలుగుతుందో వాడే నీకు గురువు. గురువు దయ వలన మనకు వివేకం కలుగుతుంది. తరువాత మన వివేకమే మనకు టీచ్ చేస్తుంది. మన వివేకమే మనకు గురువుగా ఉండి మనకు బోధించి మన జీవితాన్ని సరిదిద్దుతుంది. నిజమైన స్నేహితులు దొరకటం కూడా చాలా కష్టం. కొన్ని అపురూపమైన పక్షులు ఉంటాయి అలాగే కొంతమంది అపురూపమైన మనుషులు ఉంటారు. వారితో సహవాసం చేయటం మంచిది. మనకు అహంభావన పెరుగుతూ ఉంటే గురువుకు దూరమవుతాము, అహంభావన తగ్గుతూ ఉంటే గురువుకు దగ్గరవుతాము. ఎంత ధనం ఉన్నా, చదువు ఉన్నా, ఎన్ని అతీంద్రియశక్తులు ఉన్నా గురువు దయలేకుండా ఆత్మజ్ఞానం కలుగదు అని పెద్దలు చెపుతున్నారు అని అడిగితే ఎన్ని ఉన్నా గురువుయొక్క దయ లేకుండా ఆత్మజ్ఞానము కలుగదు అన్నారు. గురువు అంటే మన హృదయంలో ఉన్న ఆత్మే మన గురువు. మన శరీరం మరణించాక మన బంధువులు, మన స్నేహితులు మనకూడా రారు, కాని మన గురువు మనకూడా వస్తాడు. గురువు మనలను విమర్శించడు, మనలను సరిచేస్తాడు. మిమ్మల్ని పవిత్రులను చేయటానికి, మీచైతన్యస్థాయిని పెంచటానికి ఒకోసారి కష్టాలను పంపిస్తాడు. అది మీమీద ఇష్టంలేక కాదు మిమ్మల్ని బాగుచేయటానికే ఆకష్టాలను పంపిస్తాడు. మీకు కష్టాలు వస్తే కంగారుపడవద్దు, అవి భగవంతుడికి తెలియకుండా రావటంలేదు. మీరు అసూయపరులు అనుకోండి అది గురువుకు తెలుస్తూ ఉంటుంది. నిజమైనగురువు ఏమిచేస్తాడు అంటే మీరు అసూయపరులు అని చెప్పడు. అసూయను పోగొట్టుకోవటానికి మీకు సహకారం అందిస్తాడు. మాకు కోరికలు ఎక్కువగా వస్తున్నాయి అని ఒకసారి భగవాన్‌ను అడిగితే దేహంగా ఉంటే కోరికలు వస్తూనే ఉంటాయి అన్నారు. దేహంగా ఉన్నంతకాలం కామక్రోధములు వస్తాయి. వాటిని నిగ్రహించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. నీవు ఆత్మగా ఉంటే కామక్రోధములు ఉదయించనే ఉదయించవు, ఇంక ప్రయత్నం చేసి తొలగించుకోవలసిన పనిలేదు. రమణమహర్షిగారు జ్ఞాని కదా ఆయన. ఆశ్రమాన్ని కుటుంబానికి ఇవ్వటం ఏమిటి అని ప్రశ్న ఉంది. జ్ఞాని ఇస్తాడు లేకపోతే ఇవ్వడు అడగటానికి నువ్వు ఎవడు ? అది జ్ఞాని దేహప్రారబ్దాన్ని బట్టి జరుగుతుంది. వివేకానంద దేహప్రారబ్దం వేరు, రమణమహర్షి దేహప్రారబ్దం వేరు. జ్ఞాని అంటే ఇట్టివాడు అని చెప్పటానికి అసలు నీకు ఉన్న అర్హత ఏమిటి? రాముడు అవతారపురుషుడు, కృష్ణుడు అవతారపురుషుడు అని మనం అనుకొంటున్నాము. కాని బిహేవియర్ దగ్గరకు వచ్చేటప్పటికి రాముడి బిహేవియర్ వేరు, కృష్ణుడి బిహేవియర్ వేరు.





అది దేహప్రారబ్దాన్ని బట్టి అలా జరుగుతుంది. అంతేగాని లోపల జ్ఞానంలో మటుకు తేడా లేదు.

సత్యమైననేనుకు పరిమితులు లేవు, సత్యమైననేనుకు కాలంలేదు, దేశం లేదు, దేహం లేదు. సత్యమైననేను అనుభవంలోనికి వచ్చినవాడు ఎక్కడఉంటే అదే అరుణాచలం, వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. ఏ హృదయంలో అయితే మిధ్యానేను అణిగిపోతుందో, నేను అనే తలంపు ఎక్కడయితే కాలి బూడిదవుతుందో అక్కడే నీకు సంకల్పశూన్యస్థితి కలుగుతుంది, అదే పరమపదం, అదే విష్ణుపదం. ఏదైతే మనలో నేనుగా వ్యక్తమవుతోందో అది దాని మూలములోనికి వెళ్లి నశిస్తే అప్పుడు విష్ణుపదం పొందుతావు. అప్పుడు నీ హృదయంఅంతా ఆనందంతో, శాంతితో నిండిపోతుంది. అప్పుడు రూపదృష్టి, నామదృష్టి ఉండదు. భగవంతుడు ఉన్నాడా లేడా అనే తలంపురాదు. రూపచింతన, నామచింతన ఎప్పుడైతే పోతుందో అప్పుడు మీకు చిరాకు, అశాంతి తగ్గిపోతుంది. ఫలానా శరీరం నాది, ఫలానా పేరునాది అని వాటితో తాదాప్యం పొందవద్దు, ఎక్కడయితే పరమపదం ఉందో ఆహృదయంలోనికి వెళ్లకుండా మనలను ఆపుచేసేవి రూపచింతన, నామచింతన. మీకు అందుకునే అర్హత లేనప్పుడు జ్ఞాని మీ ఇంటికి వచ్చి బోధించినా ప్రయోజనం లేదు.

మనకు కోరికలు ఎప్పుడు వస్తున్నాయి. సంకల్పం వచ్చాక కోరిక వస్తుంది కాని సంకల్పం లేకుండా కోరికరాదు. మనం ఎప్పుడైతే విష్ణుపదంలోనికి వెళ్తామో అక్కడ అసలు సంకల్పాలే ఉదయించవు, వచ్చాక నిగ్రహించుకోవటంకాదు. మన దేహపోషణకు సరిపడపని చేసుకొంటూ మిగిలిన కాలాన్ని సత్యాన్వేషణకు ఉపయోగించుకోవాలి. జ్ఞానం దగ్గరకు వచ్చేటప్పటికి మన మార్గాన్ని విడిచిపెట్టకూడదు. ఒక మార్గం మీకు నచ్చినప్పుడు అందులో ప్రయాణం చేయండి. అది మంచిది కాదు అని మీ బంధువులు గాని, స్నేహితులు గాని చెప్పినా ఆమాటలు మీరు పట్టించుకోవద్దు. ఆ మార్గం మీకు సుఖంగా ఉన్నప్పుడు మీరు వెనుకకు చూడవద్దు. మీ బంధుత్వాలు ఉంటే చూసుకోండి. వారి ఇంటికి మీరు వెళ్లండి, మీ ఇంటికి వాళ్లు వస్తారు అంతేగాని జ్ఞానమార్గం దగ్గరకు వచ్చేటప్పటికి రాజీపడవద్దు. మీకు నచ్చినమార్గంలో ప్రయాణం చేయండి, వెనక్కి చూడవలసిన పనిలేదు. మనం చేసే సాధనలు అన్నీ రెండోపక్షం. గురువు యొక్క కృపలేకుండా మనం గురువును పొందలేము. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీ స్వరూపమే. కాని గురుకృప లేకుండా అది నీకు లభ్యం కాదు. గురువుయొక్క దయ ఎలా ఉంటుంది అని అడిగితే అది మాటలకు అందదు, ఊహలకు అందదు, సంకల్పాలకు అందదు, మనస్సుకు అందదు. దానిని నన్ను ఎలా చెప్పమంటావు. మాటలకంటే మౌనం ఎక్కువ సందేశం ఇస్తుంది కాని మౌనసందేశం అందరికి అర్ధంకాదు. నేను ఇక్కడ మౌనంగా కూర్చుంటే సందేశం వస్తుంది కాని అది

మీరు అందుకోలేక పోతున్నారు. అందువలన మాటలు చెప్పవలసి వస్తోంది. జ్ఞాని యొక్క మాట జ్ఞానం, మౌనం జ్ఞానం, చూపు జ్ఞానం, ప్రతీ కదలిక జ్ఞానం, అంతా జ్ఞానమే. మనం ఆడంబరం లేకుండా జీవిస్తే అప్పడు గురువు యొక్క కృప కలుగుతుంది. ఇప్పడు మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. ఈ పుట్టుకలు, చావులు అన్నీ అజ్ఞానమనే దీర్ఘనిద్రలో జరిగిపోతున్నాయి., ఇవి ఏమీ నిజంకాదు. గురువు కృప ఎలా ఉంటుంది అంటే ఇప్పడు మీరు నిద్రలో ఉన్నారు అనుకోండి. ఒక సింహం మీకు స్వప్నంలోనికి వచ్చింది అనుకోండి. ఆ సింహాన్ని చూసి భయం వేసి మనకు మెలుకువ వచ్చేస్తుంది. స్వప్నంలో వచ్చిన సింహం నిజంకాదు, కాని నీకుమెలుకువ రావటం నిజం. గురుకృప కూడా ఆ సింహం చేసిన పనే చేస్తుంది. ఆ సింహం ఏమి చేసింది మామూలు నిద్రలో నుండి నీకు మెలుకువ తీసుకుని వచ్చింది. కాని గురువుయొక్క కృప ఏమి చేస్తుంది అంటే అజ్ఞానమనే నిద్రలోనుండి జ్ఞానంలోనికి తీసుకొని వస్తుంది. నిన్ను అసత్యంలో నుండి సత్యంలోనికి తీసుకొనిరావటానికి గురువు యొక్క ఒక్కచూపు చాలు. గురువు చూపు అంటే అది ఆత్మచూపు. గురువు మీ వంక చూస్తున్నాడు అంటే చూసేది గురువు కాదు. అక్కడ వ్యక్తి కాదు, ఆత్మే చూస్తోంది. మీ హృదయంలో ఉన్న ఆత్మదగ్గరకు తీసుకొని వెళ్ళటానికి ఆత్మేచూస్తోంది. శాంతి పంచుకొంటే తరిగేది కాదు, పంచుకొంటే శాంతి పెరుగుతుంది. పంచుకొంటే పైసాలు తరగవచ్చు కాని పంచుకొంటే జ్ఞానం తరగదు, జ్ఞానం పెరుగుతుంది. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మ వస్తే సరిపోతుందా? జ్ఞానంపట్ల కాంక్ష రావాలి, మహాత్ములతో సహవాసం చేయాలి అనే బుద్ధి రావాలి. పూర్వజన్మలో పుణ్యకర్మలు చేసిఉంటే ఇవి మూడూ వస్తాయిగాని లేకపోతే రావు. ముముక్షత్వం లేనప్పడు మీకు చెట్లకు తేడా ఏమి ఉంది. చెట్లు పుట్టి, పెరిగి, చనిపోతున్నాయి. జ్ఞానం పొందాలి అనే కాంక్షలేనప్పడు మీరుకూడా అంతే అన్నారు స్వామీజీ. మీ ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలం ప్రేమను విడిచిపెట్టవద్దు, సేవను విడిచిపెట్టవద్దు. మీ చైతన్యస్థాయిని పెంచుకోవటానికి ప్రేమ అవసరమే, సేవ అవసరమే, మిమ్మల్ని నాన్నగారు అని అందరూ అంటున్నారు. మీలో ఉన్న విశేషం ఏమిటి? అని ఒకరు అడిగారు. నాలో ఏమీ విశేషం లేకపోవటమే విశేషం అని చెప్పాను. నాలో ఏదో విశేషం ఉంది, ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటే వారికి అసలు తియ్యదనం రాదు. మాకు ఎక్కువ భక్తి ఉంది అని మీరు అనుకొంటే సరిపోదు, ఈశ్వరుడు అనుకోవాలి. భక్తి వలన నీ బుద్ధి ఎంతవరకు పక్వానికి వచ్చిందో ఆయన చూస్తాడు. నీకు మెచ్యూరిటీ వచ్చినప్పడు ఆయన నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీరు ఏ విషయాలను ఎంజాయ్‌చేస్తున్నారో భగవంతుడు చూస్తూ ఉంటాడు. మీరు లోకవిషయాలు ఎంజాయ్‌చేస్తూఉంటే మిమ్మల్ని ఆయన దగ్గరకు తీసుకోడు. మనం భగవంతుడిని మోసం చేయలేము. నీవు భగవంతుడినే





ఎంజాయ్‌చేస్తూఉంటే, నీవు పక్వానికివస్తే నీ ఒక్కడికోసం శరీరం ధరించి నిన్ను రక్షించటానికి వస్తాడు. మనం ఇంకొకటినేర్చుకోవాలి. మీకు విరోధులు అయినవారి దగ్గర జ్ఞానం ఉంటే, వారి దగ్గర ఏదైనా వైభవంఉంటే మనం ఆనందించటం నేర్చుకోవాలి. మీ దేహభావన తగ్గిస్తూ, మీలో ఆత్మభావన పెంచుకొంటూ వస్తాడు, వాడు గురువు. మీతో తిరుగుతాడు, మీతో కలసి తింటాడు కాని ఆయన వచ్చిన పనివేరు. మీ అజ్ఞానాన్ని తీసుకొని వారి జ్ఞానాన్ని ఇవ్వటానికి వచ్చాడు, అది చూసుకొంటూ ఉంటాడు. ఈలోపు మీరు చెప్పిన మాటలు వింటాడు. మీరు పెట్టినది తింటాడు కాని ఆయన పనిమర్చిపోడు. సాధన పేరు మీద మీకు బాధలేకుండా సిద్ధిని ప్రసాదిస్తాడు. ఏ హృదయంలో అయితే ఆనందం ఉందో, మధ్యవర్తులతో సంబంధంలేకుండా డైరెక్టుగా ఆ హృదయగుహలోనికి మిమ్మల్ని తీసుకొని పోవటానికి వచ్చిన అవతారమే భగవాన్. గాంధీ మనలాగే ఈ భూమి మీద పుట్టాడు గాని ఈ భూమికి సంబంధించిన కాంక్ష ఏమీలేదు, అధికారం మీద కాంక్షలేదు. ఆయన చాలా తక్కువ మాట్లాడేవాడు. భారతదేశంతో, భారతజాతితో తాదాప్యం పొందాడు. దేశంగౌరవం ఆయన గౌరవం, దేశం అగౌరవం ఆయన అగౌరవం అలా దేశంతో తాదాప్యం పొందాడు. మనం దేవుడిని ఎలా ఆరాధిస్తామో అలాగే ఆయన దేశాన్ని ఆరాధించాడు, దేశంకోసం మాట్లాడాడు, దేశంకోసం ప్రార్థించాడు, దేశంకోసం ఉపవాసాలు చేసాడు. ఆయనకు కామన్‌మేన్‌తో తాదాప్యం, అందువలననే తుండుగుడ్డలు కట్టుకొన్నాడు, ఆయనకు కట్టుకోవటానికి చొక్కాలేకకాదు. అందుచేత గాంధీగారు మహాత్ముడు అయ్యాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 19-2-2003, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పొందవలసిన వస్తువు మనహృదయంలోనే ఉంది. అది ఎక్కడో కైలాసంలో ఉంది, వైకుంఠంలో ఉంది అని మనకు అనిపిస్తుంది కాని అది ఇక్కడే మన హృదయంలోనే ఉంది. ఇక్కడనుండి మనం కాశీ, రామేశ్వరం, షిరిడీ ఇలా వేలాది మైళ్ళు దూరం వెడుతున్నాము. మన తలకాయకు, హృదయానికి పెద్ద దూరంలేదు, రెండుజానల దూరం ఉంది, ఈ రెండుజానల దూరం వెళ్ళలేకపోతున్నాము, దానిని పొందలేకపోతున్నాము. ఇదే మాయ. మీరు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా ధ్యానమార్గంలో ప్రయాణం చేసినా, మీరు ఏగురువును ఆశ్రయించినా, మీరు ఏరూపాన్ని ధ్యానంచేసినా ఏనామాన్ని స్మరించినా మీరు పొందవలసింది హృదయంలోనే పొందాలి, అది మర్చిపోవద్దు. మనం నేను నేను అంటాము. అది ఒక తలంపు. మొత్తం సంసారం

అంతా ఈ నేను అనే తలంపులోనే ఉంది. మనకు లాభం వస్తే ఈ నేను అనే తలంపు పొంగిపోతుంది, నష్టంవస్తే ఈ నేను అనే తలంపు కృంగిపోతుంది. ఇష్టాలు, అయిష్టాలు, బంధువులు, స్నేహితులు, డబ్బు గొడవలు మొత్తం సంసారం అంతా నేను అనే తలంపులోనే ఉంది. ఈ నేను అనే తలంపు హృదయంలోనుండి ఉదయించి, శిరస్సులో విజృంభిస్తుంది. ఒక్క గాఢనిద్రలో మటుకు అది హృదయంలో ఉంటుంది. మెలుకువరాగానే అది శిరస్సులోనికి వచ్చేస్తుంది. అది గాఢనిద్రలో ఏ హృదయంలో అయితే ఉందో అక్కడకు జాగ్రదవస్థలో దానిని పంపలేకపోతున్నాము. అందువలననే మనం శవాలను మోయవలసి వస్తోంది. గీతలో భగవంతుడు అనేక మంచి విషయాలు చెప్పాడు కాని మనకు అర్హతలేక, యోగ్యతలేక అవి అబద్ధాలు అనుకొంటున్నాము. ప్రేమకుఉన్న శక్తి, కోరికకు ఉండదు. ప్రేమ వేరు, కోరిక వేరు. ప్రేమ యొక్క శక్తిని మీరు ఆపుచేయలేరు, అది సృష్టి అంతా వ్యాపిస్తుంది. బాబాను ఇంతమంది ఎందుకు ఆరాధిస్తున్నారు అంటే ఆయనకు మానవజాతి పట్ల ఉన్న మినహాయింపులు లేని ప్రేమవలన ఆరాధిస్తున్నారు. మీకు భక్తి ఉండవచ్చు. మీరు పూజలు, జపాలు చేసుకోవచ్చు కాని వివేకం విడిచిపెట్టకూడదు, విచక్షణ విడిచిపెట్టకూడదు. మనం ఎలా నడుచుకొంటే మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు అనుభవంలోనికి వస్తాడు అని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. పరమాత్మ మన హృదయంలో ఉన్నాడు. మనం ఎలా నడుచుకొంటే, ఎలా జీవిస్తే, ఎలా ప్రవర్తిస్తే ఆయనను పొందుతామో జాగ్రత్తగా ఆలోచించుకొని ఆ రకంగా మన జీవితాన్ని సరిదిద్దుకోవాలి. మనం తింగరనేనును తగ్గించుకోవాలి. ఒక తింగరనేను ఇంకొక తింగరనేనుతో స్నేహం చేయటం, జ్ఞానానికి దూరం అవ్వటం, ఇది ఇప్పుడు సమాజంలో జరిగేది. ఈ ఇద్దరిలో ఒకరికి జ్ఞానం ఉంటే తింగరనేనును సరిచేస్తాడు. ఇద్దరికి జ్ఞానం లేనప్పుడు ఆ తింగరనేను ఎలా సరిఅవుతుంది. తింగరనేను ఎక్కడ ఉంటే అక్కడ చీకటి ఉంటుంది, బాధ ఉంటుంది, నరకం ఉంటుంది.

మనకు ఎటువంటి తలంపులు వస్తాయి అంటే అవి మనకు పనికిరావు, మనకుటుంబానికి పనికిరావు, సమాజానికి పనికిరావు. ఎందుకు పనికిరాని తలంపులను నెత్తిమీద మోసుకొని తిరగటం, అక్కడనుండి డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోయామనటం, బెంగలు పెట్టుకోవటం, మిగతావారి నిద్రను శాంతిని చెడగొట్టటం. కొంతమంది చాలా మంచివారు ఉంటారు. వారు మంచిపనులు చేస్తారు, పదిమందికి సహాయం చేస్తారు. కాని ఎన్ని మంచిపనులు చేసినా హృదయంలోనికి వెళితేనే గాని వారికి కూడా నిండుతనం రాదు, పునర్జన్మలేనిస్థితిని పొందలేరు. మనం మంచిపనులు చేయలేకపోయినా కనీసం ఎవరైనా





చేస్తూ ఉంటే చెడగొట్టకుండా ఉంటే సరిపోతుంది. మనకు ఇప్పుడు ఒక శరీరం ఉంది. కాబట్టి దానిని నిలబెట్టుకోవటం కోసం ఏదో ఒక పని చేసుకోవాలి. ఏదో పని చేయకపోతే రోజులు వెళ్ళవు. పొట్ట వెళ్ళదు. అంతేకాని కేవలం పొట్టే సర్వస్వం అనుకోకూడదు. కేవలం బట్టకోసం, నీడకోసం, తిండికోసం ఉన్నట్లు జీవించకూడదు. ఒక మేడకు పునాది ఎటువంటిదో మన భౌతికజీవితానికి, ఆధ్యాత్మికజీవితం పునాదిగా ఉండాలి. పునాది లేని మేడ ఎలాఉంటుందో, ఆధ్యాత్మికజీవితంతో సంబంధంలేని లౌకికజీవితం అలా ఉంటుంది. మన ఇంట్లో అందరూ సత్వగుణంతో ఉండరు. భార్య సత్వగుణంతోఉంటే భర్త రజోగుణంతో ఉంటాడు. ఇంట్లో అందరూ అన్ని గుణాలతోఉంటారు, ఒకేలాగ ఉండరు. మన ఇంట్లో అభిప్రాయబేధాలు ఉంటే మనం ఏమిచేయాలి అంటే మనం చెప్పిన మాట వాళ్ళకు అర్ధమవుతూ ఉంటే ముందు మానవప్రయత్నం చేయాలి, డిస్కషన్‌లో పెట్టాలి, అప్పడు కూడా వాళ్ళకు అందకపోతే అది వేరే విషయం. ముందు మన డ్యూటీ మనం చేయాలి, తరువాత భగవంతుడి నిర్ణయానికి వదిలి వేయాలి. భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే నీ ప్రయత్నం ఏదో నువ్వు చెయ్యి. దాని ఫలితం ఎలా ఉంటుందో అది నీ చేతులలో లేదు, ఈశ్వరుడు చేతిలో ఉంది. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్దగా, ప్రేమగా, ఏకాగ్రతతో, త్రికరణశుద్ధిగా చెయ్యి, నటనకోసం చేయకూడదు. నోటితో మాట్లాడుతూకళ్ళతో వెక్కిరించకూడదు. ఆధ్యాత్మికజీవితంలో మరీ ముఖ్యమైనది సహనం. ఎందుచేతనంటే సహనం లేకపోతే మనిషి యొక్కలోతులు పెరగవు. ఏ నాటికైనా పడ్డవాడు మహాత్ముడవుతాడు కాని అన్నవాడు ఎవడూ మహాత్ముడు అవ్వలేడు. ఈ తింగరనేనును వేసుకొని మనం ఎన్ని జన్మలు ఇలా తిరుగుతాము. ఈ తింగరనేనుకు శరీరం ఒకటి కావాలి, లోకం ఒకటి కావాలి, దేవుడు ఒకటి కావాలి. ఎంత గొడవ కావాలంటే అంత గొడవ చేస్తుంది. కృష్ణుడు లాంటివాడు మరల ఎప్పడు వస్తాడు అని ఈ తింగరనేను కనిపెట్టుకొని ఉంటుంది, తీరా ఆయన వస్తే గుర్తించటం చేతకాదు, ఇది లోకం. భగవంతుడు ఏ పనికైతే మనలను తీసుకొని వచ్చాడో ఆ పనిని మనం భయం లేకుండా, అసూయ లేకుండా, ప్రేమతో, భక్తితో చేస్తే భగవదనుగ్రహానికి పాత్రులవుతాము. ప్రతీ చిన్నవిషయానికి బాధపడకూడదు. ఎవరైనా విమర్శిస్తూ ఉంటే మనకు బాధ కలుగుతూ ఉంటే, మన సంతోషం కోసం ఎవరిమీదఆయినా ఆధారపడి ఉంటే ఇదంతా ఓటమిమనస్తత్వానికి దారితీస్తుంది. ఎప్పడైతే మనకు ఓటమిమనస్తత్వం వచ్చిందో అప్పడు చేతిలో ఉన్న పనిని సరిగ్గా చేయము. ఎప్పడైతే మన చేతిలో ఉన్న పనిని శ్రద్దగా చేయలేమో అప్పడు దేవుని అనుగ్రహానికి పాత్రులు కాలేము. ఓటమిమనస్తత్వం ఉండకూడదు, అది మనం నేర్చుకోవాలి. ఒక తింగరనేను, ఇంకొక తింగరనేనును మోసం చేయగలదు కాని ఈ రెండు తింగరనేనులుకలిసి భగవంతుడిని

మోసం చేయలేవు. ఎందుచేతనంటే భగవంతుడు కళ్ళులేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు. భగవంతుడు పనిచేయటానికి ఇంద్రియాలు అక్కరలేదు. కొంతమంది జీవితాలు వడ్డించిన విస్తరిలా ఉంటాయి. కొంతమందికి ఎంతో కష్టపడితేగాని ఆకులోనికి అన్నీ రావు. ఇవన్నీ భౌతికవిషయాలు, ఇవన్నీ నిజంకాదు. జీవితంలో దారిద్ర్యం కూడా కొన్ని పాఠాలు నేర్పుతుంది. దారిద్ర్యం వలన నేర్చుకోవలసిన పాఠాలు ఉంటే భగవంతుడు మనలను అక్కడ పెడతాడు. హృదయంలోఉన్న శాంతిని ఎప్పడైనా రుచిచూస్తే అది రిపీటెడ్‌గా గుర్తుకు వస్తుంది. హృదయంలో ఉన్న శాంతిని పొందటానికి కొంతమంది మహారాజులు రాజ్యాలు వదిలి పెట్టారు. తింగరనేనుకు దుమ్ము అంటే ఇష్టం. లోకంలో ఉన్న మంచిని తీసుకోదు, దుమ్ము అంతా పోగుచేసుకొని, మనస్సును బాడిచేసుకొని, పాడుజన్మలకు సిద్ధమవుతుంది. లోకంలో ఉన్న దుమ్ము అంతా అంటించుకొని ఆ దుమ్మే బాగుంది అనుకొంటుంది. అందుచేత ఆ దుమ్ములోనుండి విడుదల పొందాలనే ప్రయత్నం చేయదు. నీవు లోపలకు వెళ్ళిపో, వైభవం అంతా నీలోపలే ఉంది అంటారు భగవాన్.

మీరు అటువంటి వారు, ఇటువంటి వారు అని ఎవరైనా చెపుతూ ఉంటే అది నమ్మవద్దు. మీరు అటువంటివారు కాదు, ఇటువంటి వారు కాదు, మీరు ఆత్మ. మీరు వినవలసింది ఆమాటలు కాదు. మీరు లోపల చూసుకోండి. ఆ మాటల కూడా వెళ్ళిపోతే మీరు లోపలకు వెళ్ళలేరు. మీరు అటువంటివారు కాదు, ఇటువంటి వారు కాదు. మీరు ఎవరో మీరు తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి. అటువంటివారు, ఇటువంటివారు అనుకొంటే ఇంక తింగరనేను మిమ్మల్ని విడిచిపెట్టదు. దానికి మేత పెరిగిపోతుంది. ఇతరుల మాటమీద ఆధారపడటం ఏమిటి? మీరు ఎవరో మీరు చూసుకోండి. మీరు ఎవరో మీరు తెలుసుకోండి, ఇది భగవాన్ బోధ. ఈ తింగరనేను మీద ఎంతకాలం ఆధారపడి ఉంటారు. ఈ తింగరనేను సలహాలు పుచ్చుకొని నువ్వు వెళ్ళకు., నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో అని భగవంతుడు చెప్పాడు. వాడు అలా చెప్పాడు, వీడు ఇలా చెప్పాడు అని ఆ మాటలు వింటే వాడు ఏది అయ్యాడో మనం అదే అవుతాము. మీకు లోపల ఆధ్యాత్మికసంపద లేనప్పడు లోపల శాంతి లేనప్పడు బాహ్యంగా ఎంతధనం ఉన్నా, గౌరవం ఉన్నా ఏదో వెలితి మిమ్మల్ని వెంటాడుతూ ఉంటుంది. అది మీరు గుర్తు పెట్టుకోండి. చదువు, ధనం మంచిదే, గౌరవం ఉంటే మంచిదే కాని అవి ఏమీ మీరు కాదు. మీ దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వస్తుంది. భగవంతుడు మీకు అవకాశములు ఇస్తే వాటిని సద్వినియోగం చేసుకోండి, అంతేగాని వాటిని దుర్వినియోగం చేసి తింగరనేనుకు మేత పెట్టవద్దు. ఈ మధ్య మాకు సంతోషంగా లేదు అంటారు. సంతోషం ఎవరికి? చైతన్యానికి దేనితోనూ సంబంధంలేదు. ఇంక ఈ తింగరనేనుకుసంతోషం కావాలి. ఇప్పడు తింగరనేను దుఃఖంలో ఉంది అందుచేత సంతోషం ఎక్కడ దొరుకుతుంది అని తిరుగుతోంది. తింగరనేను దుఃఖంలో లేదు అనుకోండి, సంతోషం కోసం తిరగనక్కరలేదు. తింగరనేనులో ఉన్న గొడవలు పోగొట్టుకోవటం మానివేసి, కొత్తగొడవలు తెచ్చిపెట్టుకోవటం, దానిని పెంచుకోవటం. మీరు మాటలు పెంచుకోవద్దు, తలంపులు పెంచుకోవద్దు. అక్కరలేని తలంపులను ఎన్నాళ్ళు మోస్తారు. ఈ తలంపుల వలననే మనకు పునర్జన్మలు వస్తున్నాయి. మనకు పాఠాలు నేర్చుకొనే తెలివితేటలు ఉండాలిగాని జీవితం పొడుగునా ప్రతీ సంఘటన పాఠం నేర్పివెడుతుంది. ఈశ్వరనిర్ణయాన్ని మన పాడుబుద్ధి తొందరగా అంగీకరించదు. భగవంతుడికి మనం భిన్నంగా లేము. భగవంతుడి సంకల్పాన్ని బట్టి ప్రతీదీ జరుగుతుంది ఆయనకు భిన్నంగా ఉన్నాము అనే తలంపు మనకు బలపడిపోయింది, వేరుభావన బలపడి పోయింది. ఈ బేదబుద్ధి వలననే మనకు దుఃఖం వస్తోంది., పునర్జన్మలు వస్తున్నాయి. కొంతమంది మంచిజన్మలు వస్తే బాగుండును అనుకొంటున్నారు. మంచిజన్మలను కోరుకొంటున్నారు అంటే మంచి జబ్బులను కోరుకొంటున్నారన్నమాట. అహంకారం చేసే వ్యాపారం తగ్గించుకొంటూ రండి. మనలో భక్తిభావన పెరుగుతూ ఉంటే, శరణాగతిభావన పెరుగుతూ ఉంటే మాటలు తగ్గుతాయి, తలంపులు తగ్గుతాయి, ప్రశ్నలు తగ్గుతాయి. దేహము నేను అనే తలంపు యొక్క మూలాన్ని పట్టుకో. దాని మూలాన్ని పట్టుకొంటే నీకు శక్తి తెలుస్తుంది. శక్తిమంతుడవు అవుతావు. నీ మాటకు శక్తి వస్తుంది, నీ ప్రవర్తనకు శక్తి కలుగుతుంది. జ్ఞాని ఒకమాట చెపితే అది నదులు, సముద్రాలు, కొండలను దాటి వెళుతుంది. జ్ఞాని మాటలో శక్తి ఉంది, సత్యం ఉంది. ఆమాట మానవజాతికి వెలుగునిస్తుంది. నీ ప్రభువు నీ హృదయంలోనే ఉన్నాడు. అక్కడకు వెళ్ళేవరకు నీవులోకంలో ఎన్ని గొప్పపనులు చేసినా నీకు పరిపూర్ణత రాదు, పెర్‌ఫెక్షన్ లేదు. ఏదో వెలితి మిమ్మల్ని వెంటాడుతుంది. హృదయంలోనికి వెళితేగాని నిజమైన ఆనందం నీకు అందదు. మీరు చేసేపని వ్యాపార ధోరణిలో చేయవద్దు. వచ్చేది ఏదో వస్తుంది. రానిది ఏదో రాదు. అస్తమాను ఫలం వంక చూడవద్దు. కర్మఫలం వంక నువ్వు చూసినా దానిమీద నీకు అధికారం లేదు. నువ్వు కృషి మానవద్దు. క్రమశిక్షణ లేకపోతే మనస్సుకు లోచూపు రాదు. జపధ్యానములు ఎందుకంటే క్రమశిక్షణ కోసమే. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రేమించు., మోక్షం ఎప్పడు ఇస్తావు, ఎప్పడు దర్శనం ఇస్తావు అని అడగవద్దు, అడిగితే నీ భక్తికి పరిపూర్ణత రాదు. మీ దైనందినజీవితంలో మాటల వలన, తలంపుల వలన అహంభావనను పెంచుకోవద్దు. మొత్తం సంసారం అంతా ఈ తింగరనేనులోనే ఉంది. దీని అందానికి లోకంలో ఉన్న అన్ని గొడవలు కావాలి. ఎందుకు కావాలంటే అది తింగరిది కాబట్టి తింగర

గొడవలు అన్నీ కావాలి. నేను ఎవరు అని ఈ తింగరనేను దానిని అది ప్రశ్నించుకోదు. నువ్వు హృదయంలో మేల్కోవాలి. భగవంతుడి పాదాలను పూర్తిగా ఆశ్రయించు లేకపోతే ఈ నేను యొక్క మూలాన్ని తెలుసుకో. నీకు ఏ మార్గం ఇష్టమయితే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి. పొందవలసింది మాత్రం హృదయంలోనే పొందాలి, ఏ జన్మలో అయినా ఇక్కడికే రావాలి.

మంచి పనులు చేయమని భగవంతుడు ఎందుకు చెప్పాడు అంటే దాని వలన మనస్సు సంస్కరింపబడుతుంది. మనం చేసేపని వలన అహంభావన సన్నగిల్లాలి కాని బలపడకూడదు. మన మాట, చేత, మనకు వచ్చే తలంపులు మన హృదయంలోనికి వెళ్ళటానికి సహకరించాలి కాని మన స్వరూపం నుండి మనలను దూరం చేయకూడదు. ఈశ్వరుడి చేతలో పనిముట్టుగా ఉండు. ఆయన సంకల్పమే నీ సంకల్పం అని అనుకొంటూ ఉంటే కాలప్రవాహంలో దేహగతమైననేను నశిస్తుంది. మీ వివేకాన్ని, బుద్దిసూక్ష్మతను ఉపయోగించుకొని భగవంతుడి సంకల్పాన్ని మీ సంకల్పంగా చేసుకొంటే ఇంక దేనికి బాధ ఉండదు, తర్కాలతోపనిలేదు. భగవంతుడు ఏది ఇస్తే దానితో సంతృప్తి పడు. కొంతమంది భగవంతుడు ఇచ్చిన దానితో సంతోషపడరు. ఇవ్వనిదానికోసం ఎదురు చూస్తూ ఉంటారు, ఈ సంతోషం కూడా పోతుంది. కొంతమంది తెల్లబట్టలు విడిచిపెట్టి ఎర్రబట్టలు కట్టుకొని, నేను ఎర్రబట్టలు కట్టుకొన్నానుఅంటారు. ఇలా అనుకొంటూ తింగరనేనును పెంచుకోవద్దు అంటున్నారు భగవాన్. పూర్వం గృహస్థాశ్రమంలో ఉండేవాడిని, ఇప్పడు సన్యాసాశ్రమంలో ఉన్నాను అంటారు. గృహంలో నుండి వాడు బయటకు వచ్చాడు గాని ఈ తింగరనేనులో నుండి వాడు బయటకు రాలేదు. గృహంలో నుండి బయటకురావటం తేలికే, దేహంలోనుండి విడుదలపొందటం కూడా తేలికే కాని తింగరనేనులో నుండి బయటకు రావటం చాలా కష్టం. దానికే సాధన. నీకు ఎప్పడైనా దుఃఖం వస్తోంది అనుకో లోపల ఏదో కోరిక ఉన్నట్లు గుర్తు. నీకు ఏరకమైన కోరిక ఉన్నా శరీరం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ ఆ కోరిక కూడా దుఃఖం వస్తుంది. కోరికలో నుండి కోపం, భయం, అసూయ, దుఃఖం అన్నీ వస్తున్నాయి.

మీరు చిన్నప్పడు ఉన్నారు, ఇప్పడు ఉన్నారు, చనిపోయిన తరువాత కూడా ఉంటారు. మీరు ఆరోగ్యముగా ఉన్నప్పడు ఉన్నారు, అనారోగ్యంగా ఉన్నప్పడు ఉన్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పడు ఉన్నారు, ప్రతికూలంగా ఉన్నప్పడు మీరు ఉన్నారు. మీరు ఎప్పడూ ఉన్నారు. నేనుఉన్నాను అన్నది ఒక్కటే నిజం మిగతావి అన్నీ అసత్యం అన్నారు భగవాన్, నీ పుట్టుక, నీ చావు, సంతోషం, దుఃఖం ఇవి అన్నీ స్వప్నసమానము. నేను అలాగ ఉన్నాను, ఇలాగ ఉన్నాను అనుకొంటే అదీ స్వప్నమే. నేనుఉన్నాను అది ఒక్కటే సత్యం. దానికి మీరు ఏది కలిపినా అది అసత్యం అవుతుంది. ఆ ఉన్నస్థితిలో మీరు ఉండలేక ఏదో కల్పించుకొని హృదయంలోనుండి బయటకు వచ్చేస్తున్నారు. దేహం ఒక్కటే నిజం, దేహం తప్పించి ఏమీలేదు అని ఇలా అనుకొనేవాడిని రక్షించటం చాలా కష్టం. దురాచారాలలో ఉన్నవాడిని మనం ఒడ్డుకు తీసుకొనిరాగలం గాని దేహమే సర్వస్వం అనుకొనేవాడిని రక్షించాలి అంటే చాలా కష్టం, దానికి తాచుపాములవంటి గురువులు ఉండాలి. మీలోపల ఏదైనా వైభవం ఉన్నా, సంపద ఉన్నా మీరు నిండుగా ఉండాలి, తేలిక పడకూడదు. మీకు అన్ని విధాల బాగుంది అనుకోండి అలాగని తేలికమాటలు మాట్లాడవద్దు. మీరు నిండుగా, గంభీరంగా ఉండటం నేర్చుకోవాలి. మనకు దేహం కనిపిస్తోంది, లోకం కనిపిస్తోంది మరి అందరూ సుఖంగా, శాంతిగా ఉన్నామా? లేదు. మీరు పరిపూర్ణమైన సుఖంలో, ఆనందంలో ఉన్నప్పడు దేవుడు ఉన్నా లేకపోయినా, ఈ దేహం కనిపించినా, కనబడకపోయినా మీకు వచ్చే నష్టం ఏమిటి? కొంతమంది మనుషులు చాలా గంభీరంగా ఉంటారు. అవునంటే అవునని చెపుతారు, కాదంటే కాదు అని చెపుతారు, వారు చాలా శాంతిగా ఉంటారు. ఆ రకమైన జీవితం నేర్చుకోవాలి. ఎప్పడైతే భక్తి పరిపూర్ణమయిందో, మీ భక్తికి నిండుతనం వచ్చిందో జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది అంటున్నారు భగవాన్. ఆ గంభీరత మీకు వచ్చినప్పడు, ఆ నిండుతనం మీకు వచ్చినప్పడు భగవంతుడు ఒక్కక్షణం కూడా ఆగడు, మీకు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, నేనుఉన్నాను అంతే, అలాఉంటే ఇంక వాడికి దుఃఖం లేదు. అలాఉండండి వచ్చేదిఏదో వస్తుంది, రానిదిఏదో రాదు. అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అనుకోవటంతోనే దుఃఖం మొదలవుతుంది, పునర్జన్మలు మొదలవుతాయి. నీకుఉన్నతెలివితో తింగరనేనును పెంచుకోవద్దు. తింగరనేనునుండి విడుదలపొంది, హృదయలోనికి చేరటానికి తెలివిసహకరించాలి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు ఇష్టమైన మార్గాన్ని అనుసరించు, నీకు ఇష్టమైన గురువును ఆరాధించు. నువ్వు చేసేది సిన్సియర్‌గా చెయ్యి, ప్రేమగా చెయ్యి, శ్రద్ధగా చెయ్యి. ఆ మార్గం ద్వారా నీవు పొందేవస్తువు మీద నీకు ఎంతప్రేమ ఉందో, నీవు ప్రయాణించే మార్గం మీద కూడా నీకు అంత ప్రేమ ఉండాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 26-2-2003, శివదేవునిచిక్కాల

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు ఆనందం లేకుండా జీవించలేడు. వాడికి ఎంత ఆస్థిఉన్నా, ఎన్ని భోగాలు ఉన్నా ఆనందం లేకపోతే మానవుడు జీవించలేడు. ఆనందం మన స్వరూపంలోనే

ఉంది. ఆ ఆనందం మనకు దొరకాలంటే విసుగుగా, చిరాకుగా వెతికితే అది దొరకదు. హృదయంలో ఉన్న ఆనందాన్ని ఎవరైతే పొందుదామనుకొంటున్నారో వారు చేసే సాధన కూడా ఆనందంగా, శాంతిగా, స్థిరంగా విసుగులేకుండా చేస్తే అది దొరుకుతుంది, అంతేగాని సాధన చిరాకుగా చేస్తే ఆనందం దొరకదు. మనం శివజ్ఞానం సంపాదిస్తే శివుడిలో ఐక్యమవుతాము. శివుడిలో ఐక్యమవ్వటానికే ఈ యజ్ఞాలు, యాగాలు సాధనలు అన్నీకూడా. మనం అయ్యవారిని, అమ్మవారిని సమానంగా ప్రేమించాలి. శివుడు, పార్వతి చూడటానికి వేరుగా కనిపిస్తారు కాని ఇద్దరూ ఒక్కటే. మీరు ఎప్పుడూ శివుడి గురించే చెపుతారు గాని అమ్మగురించి చెప్పరేమిటి అని ఒకసారిభగవాన్‌ను అడిగారు. వారిద్దరు వేరైతే కదా, నేను శివుడు గురించి చెప్పే ప్రతీమాట అమ్మకు వర్తిస్తుంది అన్నారు భగవాన్. శివపార్వతులు వేరుగా లేరు, మీదృష్టికి వేరుగా కనిపిస్తున్నారు అంతే. ఉన్నది ఒక్కటే. భౌతికసంపద, ఆధ్యాత్మికసంపద వీటిగురించి ఎవ్వరికి చెప్పకూడదు. మీకు పదికోట్లు డబ్బు ఉంది అనుకోండి, ప్రక్కవారికి చెప్పకూడదు, వారికి అసూయ వచ్చేస్తుంది. ఆధ్యాత్మికసంపద అంటే మేము ఇంత సాధన చేస్తున్నాము, మాకు దేవుడు కనిపించాడు అని ఇటువంటి మాటలు చెప్పవద్దు. మీరు భక్తిమార్గంలో అభివృద్ధిలోనికి వస్తున్నారు అనుకోండి, భక్తిని రహస్యంగా ఉంచుకోండి. మరి ఏది చెప్పవచ్చు అంటే ఇతరులలో ఉన్న మంచిగుణాలు చెప్పవచ్చు. నేర్చుకొనేవారు నేర్చుకొంటారు. ఇతరులలోఉన్న మంచిని చెప్పటం వలన మనం మంచివాళ్ళమవుతాము, ఇతరులలో ఉన్న చెడును చెపుతూ ఉంటే ఆరోజుకారోజు మనం చెడ్డవాళ్ళమవుతాము. సాధన చేసేటప్పుడు కొన్ని అనుభవాలు వస్తాయి. ఆ అనుభవాలను ఇతరులకు చెప్పనక్కరలేదు. ఆ అనుభవాలను జాగ్రత్తగా చూసుకొని, వాటిలోనుండి పాఠాలు నేర్చుకొని, ఆ అనుభవాలను బట్టి మనం బాగుపడటానికి ప్రయత్నం చేయాలి. మీ అనుభవాలు మీకు బాగుపడటానికి ఉపయోగపడటంలేదు అనుకోండి ఆఅనుభవాలు అనవసరం. మీఅనుభవాల వలన మీరు బాగుపడాలి, అభివృద్ధిలోనికి రావాలి, మీ చైతన్యస్థాయి పెరగాలి, మీకు శాంతి కలగాలి, నిజమైననేను మీకు స్వరూపంగా వ్యక్తమవ్వాలి. అనుభవాలలోనుండి పాఠాలునేర్చుకొని అభివృద్ధిలోనికి రండి. మనం ఏదైనా ఒకమాట చెపితే అది ఇతరులకు ఉపయోగపడుతుందనుకొంటే ఆమాట చెప్పాలి, అది ఉపయోగపడదు అనుకొంటే ఆ మాట చెప్పకూడదు. మనం చెప్పింది ఎంతవరకు అర్థమవుతోందో కూడా మనం చూసుకోవాలి. మనం ఎక్కువ ఆలోచించాలి, ఎక్కువ పనిచేయాలి. తక్కువ మాట్లాడాలి. మనం సాధనచేసి తరించాలి. ఏదో కొద్దిసేపు పూజలు, జపాలు చేయటం, తరువాత రోడ్డుమీద పడటం. మనకు వాక్కునియమంలేదు, మనస్సులో నియమం లేదు. ఇలాకాదు, మన దైనందిన జీవితాన్ని సాధనగా చేసుకోవాలి. ఉదయం





లేచినది మొదలు రాత్రి పడుకొనే వరకు మనం ఏమిచేస్తున్నాము, ఏమి మాట్లాడుతున్నాము, ఏమి ఆలోచిస్తున్నాము అని జాగ్రత్తగా చూసుకొంటూ జీవితంఅంతా సాధనగా తీసుకోవాలి. జీవితం అంతా ప్రతిమాటలో, ప్రతీచేతలో, ప్రతీచూపులో, సమాజంతో మీకుఉన్న అనుబంధంలో ప్రతీ చిన్నసంఘటనను మీరు సాధనగా తీసుకొంటే మీకు జీవభావం నశిస్తుంది, బ్రహ్మాభావం కలుగుతుంది, ఇది సాధన. మనలో రాగద్వేషములు పెరుగుతూ ఉంటే లెక్కకు అందని తప్పలు చేసేస్తాము. మీరు ఇంటిదగ్గర ప్రశాంతంగా ఉన్నప్పడు, మనస్సు నిర్మలంగా ఉన్నప్పడు చూసుకోండి అప్పడు అహంభావనకు అసలు మేత దొరకదు. అలాకాకుండా చిరాకుగా, కోపంగా, ఎక్కువ రాగద్వేషములతో ఉన్నారు అనుకోండి, అహంభావనకు మేత దొరుకుతుంది, అది పెరిగిపోతుంది.

నీ మనస్సు ఉద్రేకపడుతూ ఉంటే, నీ మనస్సు బాహ్యాముఖానికి వెళుతూ ఉంటే నీకు తెలియకుండానే అహంభావన పెరిగిపోతుంది. నీ మనస్సు అంతర్ముఖమవుతూ ఉంటే అహంభావన తగ్గుతూ ఉంటుంది, అది పల్చబడిపోయి చిరిగిపోతుంది. ఏ విషయం గురించి భయం పెట్టుకోవద్దు. భయంవలన మనస్సు బాహ్యాముఖానికి వస్తుంది. మీరు భయపడవలసింది ఈ సృష్టిలో ఏదీలేదు. బింబం నిజంకాని ప్రతిబింబం నిజంకాదు. ఈ మనస్సులు అన్నీ ప్రతిబింబాలే. చైతన్యం బింబం. ఈ లోకంఅంతా చైతన్యం యొక్క నీడ మాత్రమే. ఈ నీడను చూసి నీకు భయం ఎందుకు? మనకు ఎంత ధనం ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత గౌరవం ఉన్నా మనకు లోచూపు లేకపోతే ఏమీ ప్రయోజనం లేదు. లోచూపు కలుగకపోతే లోపలఉన్న వస్తువు మనకు వ్యక్తం కాదు. మనం లోచూపును అలవర్చుకోవాలి.

మీకు మెలుకువ రాగానే ముందు నేను అనే తలంపు వస్తుంది. ఆ నేను అనే తలంపు వచ్చాక నేను పురుషుడను, నేను స్త్రీని, నేను డాక్టరును అని ఇలా మిగతాతలంపులు అనేకం వస్తాయి. ఆ నేను అనే తలంపు వచ్చాక దేవతలు, ఇతరులు వస్తున్నారు. ఈనేను అనే తలంపు రాకముందు నీకు దైవస్మరణకూడా రాదు. ఈనేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. ఈనేను అనే తలంపు ఎవరు? ఇది గాఢనిద్రలో లేదు, మెలుకువ రాగానే ఈ నేను అనే తలంపు వస్తోంది, ఇది ఎక్కడనుండి వస్తోంది అని ఆ నేను అనే తలంపును విచారణ చేయటం మానివేసి, అది కల్పించిన విషయాల కూడా పడుతున్నాము, ఇదే మాయ. జీవితంలో ఏ సంఘటన జరిగినా కంగారుపడవద్దు. ప్రతీ చిన్నసంఘటన కూడాఈశ్వరుని నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఆ సంఘటన ద్వారా మీకు పాఠాలునేర్పి హృదయంయొక్క లోయలలోనికి తీసుకొని వెళ్ళటానికి భగవంతుడు చేస్తున్నాడు, ఇది

ఈశ్వరుని ప్రణాళిక. డబ్బు సంపాదించటం కంటే సహృదయం సంపాదించటం చాలాకష్టం. చేతిలో డబ్బు ఉంటే బజారులో వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో, సహృదయం ఉన్నవాడికి జ్ఞానం రావటం అంత తేలిక. మీ అనుగ్రహం కావాలి అని అడిగితే నాఅనుగ్రహాన్ని తీసుకోవటానికి ఎంతో కొంత కృషి ఉండాలి. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు కృషి, కృప రెండూ అవసరం. అప్పడే ఆత్మానుభవం కలుగుతుంది. గురువు ఎంతకాలం అవసరం అని అడిగితే నీలో అజ్ఞానం ఎంతకాలం అయితే ఉందో, వ్యక్తిభావన ఎంతకాలం అయితే ఉందో అంతకాలం గురువు అవసరమే. నీవు సాధన చేయగా చేయగా భగవంతుడే గురురూపంలో వచ్చి నీకు మార్గం చూపిస్తాడు, మార్గం చూపించటమే కాదు నిన్ను నడిపిస్తాడు, నడిపించటమే కాదు నిన్ను ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. అన్నీ ఆయనే, ఉపాయం ఆయనే, మనం పొందేది ఆయన్నే, పొందింపచేసేమార్గం కూడా ఆయనే. అంతా గురువే. మనం మనస్సును ఎక్కువగా ఉపయోగించకూడదు. మీరు అహంభావన యొక్క వాడకం తగ్గిస్తే మీకు భౌతికజీవితంలో వచ్చే ఆటంకాలు, ఆధ్యాత్మికజీవితంలో వచ్చే ఆటంకాలు నూటికి 99 ఆటంకాలు తగ్గిపోతాయి. మీరు దేనిగురించి భయపడవద్దు. ఈ భయాలు, ఇష్టాలు, అయిష్టాలు, స్నేహితులు, బంధువులు, విరోధులు బయటలేరు, నేనులోనే ఇవి అన్నీ ఉన్నాయి. ఆ నేను అణిగిపోతే ఏదీ లేదు. ఆ నేను పోవాలంటే పరిశ్రమ, క్రమశిక్షణ ఇవి రెండూ ముఖ్యం. కొంతమంది మంచిని జ్ఞాపకం పెట్టుకొంటారు కాని చెడును జ్ఞాపకం పెట్టుకోరు. ఒకసారి విశ్వనాధసత్యనారాయణ గారి దగ్గరకు ఎవరో కవిత్వం వ్రాసి తీసుకొని వచ్చారు. ఆయన కవిత్వం చదివారు వచ్చిన ఆయనకు కాఫీ ఇచ్చారు, గ్లాసు కడిగిపెట్టమన్నారు. తరువాత అతనితో నేను గ్లాసు కడగమన్నాను అని యాగీ చేస్తావా అని అడిగారు. మీరు గ్లాసు కడిగించారు అని నేను ఎక్కడ చెప్పను కాని మీరు కాఫీ ఇచ్చారు అని అందరితో చెపుతాను అని అన్నాడు. అది బుద్ధిమంతుని లక్షణం. ఆబుద్ధి మనలో ఎంతమందికి ఉందో చెప్పండి. మనం అయితే ఆయన కాఫీ ఇచ్చారు అని చెప్పటం మానివేసి గ్లాసు కడిగించారు అని అందరికి చెపుతాము. ఇదిమన పాడుబుద్ధికి గుర్తు. నువ్వు ఏ వస్తువునయితే తెలుసుకోవాలనుకొంటున్నావో, అది ఎంత తెలియబడాలి అని కాంక్షలో ఉందో, నీకు కూడా తెలుసుకోవాలనే కాంక్ష కొద్దిగా అయినా ఉంటేనే గాని పనిజరుగదు, నీకు జ్ఞానోదయం అవ్వదు.

చివరి శ్వాసవరకు మనం సాధనలో జాగ్రత్తగా ఉండాలి. అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, గజస్నానం అసలే పనికిరాదు. మనం చేసే సాధనలు గజస్నానం తంతులా ఉన్నాయి అని ఆచార్యులవారు అంటున్నారు. ఏనుగును శుభ్రంగా స్నానం చేయిస్తే తరువాత అది గట్టుమీదకు వచ్చి తొండంతో మొత్తం బాడి చేసుకొంటుంది, మన సాధనలు

5-3-2003

4A

అలాగే ఉన్నాయి. శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే నువ్వు ఏదైనా మంచిపని చేసావనుకో, నువ్వు చేసిన పనిని నువ్వే కీర్తించుకొంటున్నావు అనుకో, అది పదిమందికి చెప్పకొంటున్నావు అనుకో ఆ మంచి పనివలన వచ్చే ఫలితం పూర్తిగా పోతుంది అని చెప్పారు. పని ప్రశాంతంగా చేసుకొని వెళ్ళిపోతావు అనుకో, కర్మఫలానికి వడ్డీకూడా కలిపి ఇస్తాడు. రామకృష్టపరమహంస గారికి కేన్సర్ వచ్చింది. ఓ మనసా! ఈశరీరానికి కేన్సర్ వచ్చింది, నీవు ఇటురాకు, హృదయంలోనికి వెళ్ళిపో, అక్కడ ఆనందాన్ని అనుభవించు. నీవు స్మరించవలసింది ఈ శరీరాన్ని కాదు. క్యాన్సర్‌ను కాదు. నీవు అమ్మను స్మరించు, ఆత్మను స్మరించు. రామకృష్ణపరమహంస శరీరం చనిపోయినప్పడు స్మశానానికి ఎక్కువ మందిరాలేదు కాని ఇప్పడు రామకృష్ణమిషన్ ప్రపంచవ్యాప్తి చెందింది. ఆశక్తి ఎక్కడనుండి వచ్చింది.? ఆయన భావనాబలం, ఆత్మబలం, ఆయన శరీరం పోయినా ఆ భవనాతరంగాలు, చైతన్యతరంగాలు ప్రవహిస్తూనే ఉంటాయి. శరీరానికి, ఆభావనాబలానికి ఎటువంటి సంబంధం లేదు. మనస్సు ఆత్మాకారం చెందేవరకు దానిని లోపలకు తోలుకొని వెళ్ళాలి, అయితే ఈలోపు నీవు టైర్ అవ్వకూడదు. లోపలఉన్న వస్తువు ఎంత మధురంగా ఉందో, ఎంత తియ్యగా ఉందో నీ ప్రయత్నం కూడా అంత తియ్యగా, అంత మధురంగా ఉండాలి. నాకు లోపల ఎంతో కొంత శాంతి ఉంటే ఆ శాంతిని మీకు పంచి పెట్టే శక్తి నాకు లేనప్పడు ఈ కుర్చీలో కూర్చొనే అర్హత కూడా నాకు లేదు. ఆకాశంలోమేఘాలు ఎలా తిరుగుతున్నాయో, ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకు నా మనస్సులో ఏవోతలంపులు అలా తిరుగుతున్నాయి. ఆతలంపులు నాకు మంచిచేస్తున్నాయో, చెడు చేస్తున్నాయో తెలుసుకోలేని వివేకహీనుడిని, ఇలా జన్మజన్మలు తిరుగుతున్నాను. ఒకతలంపు వదిలి ఇంకోతలంపును పట్టుకొంటున్నాను, ఒక గోతిలోనుండి బయటకువచ్చి ఇంకొక గోతిలో పడుతున్నాను. ఈ మనస్సు ఎంతకాలం ఇలా తిరుగుతుంది. ఓ అరుణాచలేశ్వరుడా! నీవు అంతర్యామిగా ఉన్నావు కదా, నీవు శక్తిస్వరూపుడవుకదా. ఈ మనస్సుకు తిరగటం అలవాటు అయిపోయింది, ఒకచోట కుదురుగా ఉండటంలేదు అందుచేత ఈ మనస్సుకు నీ శక్తిని, నీ తేజస్సును, నీ వైభవాన్ని కొంచం రుచిచూపించు. అప్పడు ఇంత బాగుందా అని హృదయంవైపుకు ప్రయాణం చేయటం మొదలుపెట్టి, లోపలకువచ్చి నీలో అణిగిపోతుంది, నీ ఆకారం పొందుతుంది. అది నువ్వే చెయ్యి. నేను ఎందుకు చేస్తాను? యోగ్యత ఉండాలి కదా అంటావేమో ఆ యోగ్యతను నీవేపట్టించి, నన్ను బాగుచేసి, నీ అంతటివాడిని చేసి, నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించు అన్నారు.

రమణ భాస్కర

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 09-03-2003 | ఆదివారం | పాలకొల్లు - క్షత్రియ కళ్యాణ మండపం |
| 12-03-2003 | బుధవారం | జిన్నూరు - శ్రీ రమణక్షేత్రం |
| 15-03-2003 | శనివారం | ఆత్రేయపురం, (వయా) రావులపాలెం, తూ॥గో॥జిల్లా |
| 18-03-2003 | మంగళవారం | చించినాడ - గీతామందిరం |
| 21టు 29-3-03 | | విశాఖపట్నం కేంపు |

### "కోపిష్టి - పాపిష్టి ఔతాడు".

రాక్షస గుణాలలో కెల్లా రాజు లాంటిది కోపము. ఆ గుణం ఆవరించటం వల్లనే, మానవుడు దానవుడు ఔతాడు. కోపం మనిషిని పిచ్చివాణ్ణి కూడా చేస్తుంది. రాజు కోపదారి అయితే యుద్ధాలతో సమాజాన్ని అశాంతితో అల్లకల్లోలం చేస్తాడు. మానవుడు తన అస్థిత్వానికి మూలమైన ఆత్మను మర్చిపోవటం వల్లనే ఈ అసురగుణాల్లోకి జారిపోతాడు. కోపం కారణం వల్ల మంచిగుణాలు ఏమైనా ఉన్నా అవి రాణించవు. దుర్వాసముని కామాన్నిజయించాడు అన్న నిజాన్ని గ్రహించలేక, సమాజం ఆయనకు కోపిష్టిగానే ముద్రవేసింది. యితరుల వస్తుసముదాయమును పొందాలనే ప్రయత్నంలో విఫలమైనప్పుడు, హింస, ఎగతాళికి గురి అయినప్పుడు, వేరుభావన వల్ల ప్రతీకారం తీర్చుకొందామనే తలంపుల్లోంచి ఈ కోపం పుడుతుంది. కర్త యొక్క ఆజ్ఞచేతనే కర్మ ఫలిస్తున్నది, అన్నవివేకం కలిగినవాడు నిజాన్ని గ్రహిస్తాడు నిర్మలంగా ఉంటాడు. మన పన్ను మన పెదిమను కరుచుకొంటే ప్రతీకారంతో పన్నును లాగము రెండూ మనవే. జ్ఞాని ఎవరిని చూచినా హృదయాన్ని చూడటం వల్ల అంతా తానే, కోప - తాపాలు ఎక్కడ? నిద్రలోలేని ఈ కోపతాపాలు మెలకువలో ఏశక్తి సహాయంతో తెలియబడుతున్నాయి! అని విచారించి, కోపం మీద కోపపడినా, లేదా కోపాన్ని ద్రష్టగా చూడటం నేర్చుకొన్నా, కోపం కరిగిపోయి, కొండంత ఆనందం మనముందు కొలువుతీరి ఉంటుంది. సాధకుడు న్యాయమార్గంలో నడుస్తూ, మౌనాన్ని, సహనాన్ని అలవర్చుకోవాలి. కొందరిజీవితాలు సమస్యలు లేకుండా సౌఖ్యంగా సాగిపోతే వారు అరిషడ్వర్గాలను జయించాము అని అనుకోకూడదు. మనం ఎవరినీ నీచులుగా చూడకూడదు, చేతనైతే వారిలోమంచిని చూడాలి. లేదా ఉదాసీనంగా ఉండాలి. శ్రీనాన్నగారు అంటారు "ద్వేషం నిప్పలాంటిది ఎదుటి వారిఔన్నత్యాన్ని తెలుసుకోనివ్వదు. అజ్ఞాని కామిస్తాడు, జ్ఞాని ఈ సృష్టిని అంతా ప్రేమిస్తాడు. కష్టపడి పనిచేసే వాడికి కోపపడటానికి టైము ఎక్కడ, తెలివితక్కువ వాళ్లకే కోపం ఎక్కువగా ఉంటుంది. సత్వగుణం భవనాన్ని నిర్మిస్తే, రజోగుణం దాన్ని కూలుస్తుంది. ఆరజోగుణమే మన హృదయంలో ఉన్న శాంతిని అందకుండా చేయిస్తున్నది." అన్నారు. కాబట్టి కోపకారణం ఉన్నప్పటికీ ఎవరికైతే కోపంరాదో వారే ఉత్తమసాధకులు వారినే స్వర్గరాజ్యం వరిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**. అర్థవరం

ॐ

## SRI NANNAGARU

**MY HEART WAS CALLING YOU**
**LONGING TO SEE YOU**
**TO FEEL THY PRESENCE**
**GOD'S PRESENCE**
**SRI KRISHNA**
**SRI RAMANA**
**SRI ARUNACHALA SHIVA**
**THEN "YOU" CAME**
**TO EASE THE PAIN**
**AND CALM THE WAVES**
**TO SEND ME BACK**
**HOME.**
**WHERE I BELONG!**
**"OM NAMA SHIVAYA OM"**

IN DEEP GRATITUDE
YOUR
**RAMNATH**


## రమణ భాస్కర

ఫారం 4 (రూలు 8)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలము | : | **పాలకొల్లు** |
| 2. | ప్రచురణ కాలము | : | **పక్ష పత్రిక** |
| 3. | ప్రచురణ కర్తపేరు | : | **పి.ఎస్. రామరాజు** |
| 4. | భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 5. | చిరునామా | : | **లక్ష్మీమోడరన్ రైస్ మిల్లు, ఉల్లంపర్రు- పాలకొల్లు** |
| 6. | పబ్లిషర్ భారతీయుడా? కాదా? చిరునామా | : | **భారతీయుడు, పాలకొల్లు** |
| 7. | సంపాదకుడు భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 8. | పత్రిక యాజమాన్యం | : | **పి.ఎస్. రామరాజు, పబ్లిషర్ & ఎడిటర్** |